ఈత కొడదాం రండి


స్విమ్మింగ్ పూల్‌లోకి డైవ్ చేస్తున్న చిన్నారులు

- మురళీనగర్ ప్రజలకు అందుబాటులో స్విమ్మింగ్ పూల్
- వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఈతలో శిక్షణ
- స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటుతున్న చిన్నారులు

మురళీనగర్: వ్యాయామానికి అనేక విధానాలు ఉపయోగిస్తాం. నడకతోపాటు కనీస వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ సాధనం చేస్తారు. క్రీడలూ ఇందుకు దోహదపడతాయి. వ్యాయామంతోపాటు క్రీడాసక్తిని తీర్చుకోవడానికి స్విమ్మింగ్ ఉపయోగపడుతుంది. అంతే కాదు ఇది ప్రాణ రక్షణకు సహకరిస్తుంది. ప్రమాదాలు జరిగి తటాకాల్లో పడిపోతే ఈత ద్వారా స్వయం రక్షణ సాధ్యమవుతుంది. దీంతో స్విమ్మింగ్ చేయాలనే ఆసక్తి పెరుగుతోంది. పిల్లలు, పెద్దలు, మహిళలు కూడా ఈత అంటే ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అందుబాటులో ఉండే స్విమ్మింగ్ పూల్‌ను ఆశ్రయిస్తున్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆధునిక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండే రుసుముతో నిర్వహిస్తున్నారు.

ఆధునిక పూల్.. బేబీ పూల్

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పెద్దలతోపాటు చిన్నారులకు బేబీ పూల్ ప్రత్యేకంగా ఉంది. 25 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు కలిగిన ఆధునిక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. పూల్ రన్నింగ్ సమయంలో రోజంతా నిరంతరం మోటార్ రన్ అవుతుంది. వేస్టేజీ వాటర్ డ్రైనేజీకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. నీటిలో క్లోరిన్‌తోపాటు జర్మ్స్ పోవడానికి ద్రావణం కలుపుతారు. రోజూ రెండు సార్లు శుభ్రం చేస్తారు. నీటి స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తారు.

పూల్ విశేషాలు.. నిర్వహణ సమయం

- ఉదయం: 5–6, 6–7, 7–8 గంటల సమయంలో మూడు బ్యాచీలకు ఈతలో శిక్షణ ఇస్తారు.
- సాయంత్రం: 5–6, 7–8 గంటలకు రెండు బ్యాచీలకు శిక్షణ ఇస్తారు.
- సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు మహిళలకు మాత్రమే శిక్షణ ఉంటుంది.
- బ్యాచ్‌కు 50 మంది వరకు అనుమతిస్తారు.
- ఇలా ప్రతి రోజూ ఈత కొలనులో 200 మంది వరకు స్విమ్మింగ్‌కు వస్తారు.
- ఫీజు: నెలకు 1,400. ఇది ఈ నెలాఖరు(వేసవి) వరకు వర్తిస్తుంది. జూలై నుంచి రూ.700.
- శాశ్వత సభ్యులకు రూ.300 వసూలు చేస్తారు.
- పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా కోచ్‌లను ఏర్పాటు చేశారు.

డ్రెస్ చేంజింగ్‌కు ఏర్పాట్లు

స్విమ్మింగ్‌కు ముందు, తర్వాత షవర్ బాత్‌కు ఏర్పాట్లు చేశారు. తప్పనిసరిగా వీరు ఈ నిబంధన పాటించాలి. పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా డ్రెస్ చేంజింగ్ రూమ్స్, వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్‌కు వచ్చే వారు తమతోపాటు స్విమ్ సూట్, గాగుల్స్, క్యాప్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. పురుషులకు జి.రామారావు ఇక్కడ 8 ఏళ్లుగా ఈతలో కోచింగ్ ఇస్తున్నారు.


మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని ఈత కొలను వద్ద చిన్నారి స్విమ్మర్లు

పోటీల్లో మురళీనగర్ విద్యార్థుల సత్తా

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులను వివిధ స్థాయిల్లో పోటీలకు తయారు చేస్తున్నారు. వీరిలో చాలా మంది జాతీయ స్థాయిలో రాణించారు. ఇప్పటి వరకు 20 మంది జాతీయ స్థాయిలో పాల్గొని 5 బంగారు పతకాలు సాధించారు. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఎంపిక నిర్వహిస్తున్నారు. వీరిలో 18 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


ఈత పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

లాభాపేక్ష లేకుండా నిర్వహణ



మురళీనగర్‌లో ప్రజలందరికీ ఉపయోగపడేలా స్విమ్మింగ్ పూల్‌ను లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్నాం. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కలిగించడం, వారికి ఆసక్తి కలిగిన క్రీడల్లో ప్రోత్సహించడం ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి ఏడాది పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. నగరంలోని అన్ని స్విమ్మింగ్ పూల్స్ కన్నా తక్కువ ఫీజుతో నిర్వహిస్తున్నాం. అందుకే మా స్విమ్మింగ్ పూల్‌కు డిమాండ్ ఉంటుంది.
– సనపల వరప్రసాద్, అధ్యక్షుడు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు

ఉద్యోగాల సాధనకు స్విమ్మింగ్



స్విమ్మింగ్ వల్ల ఆరోగ్యంతోపాటు ఈ క్రీడలో రాణించే విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి రిజర్వేషన్ పొందుతారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయి. మానసికోల్లాసానికి ఈత ఉపయోగపడుతుంది. 8 ఏళ్లుగా వేలాది మందికి శిక్షణనిచ్చాం. వీరిలో చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. డెకథ్లాన్ సంస్థ కూడా స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తుంది. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నాం.
– జి.రామారావు, కోచ్, మురళీనగర్

విష్ణుకుమార్‌రాజు నివాసానికి హోం మంత్రి రాక


రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుటుంబ సభ్యులు

సీతమ్మధార: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నివాసానికి చేరుకున్నారు. ఆమెకు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. తన నివాసంలో కుటుంబ సభ్యులతో అర్ధగంట సేపు చర్చించారు. హోం శాఖ మంత్రిని విష్ణుకుమార్‌రాజు, భార్య సీత సుజాత, కుమారుడు పృథ్వీరాజు, కుమార్తె శ్యామలాదీపిక, అల్లుడు సునీల్ అగర్వాల్ ఘనంగా సత్కరించారు. అనంతరం బీజేపీ ఉత్తర కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అనితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ హోం శాఖ మంత్రిగా అనిత పదవీ బాధ్యతలు స్వీకరించి.. విశాఖలోని తన నివాసానికి రావడం ఆనందంగా ఉందన్నారు. విష్ణుకుమార్‌రాజు ఇంటి వద్ద ద్వారకా ఏసీపీ రాంబాబు, సీఐలు ఎస్.రమేష్, ఎస్.విజయకుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తులో ఉన్నారు.

నేడు బక్రీద్ వేడుకలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మస్జిద్ ఈ అల్ ఖదీర్ వద్ద సోమవారం బక్రీద్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వేకువజామున 5.30 గంటలకు ఫజర్ నమాజ్ ఆచరించి, శాంతి ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం 7.30 గంటలకు అక్కడే ఉన్న బరియల్ గ్రౌండ్ సమీపంలో ఈద్ నమాజ్ ఆచరిస్తామన్నారు. నమాజ్ అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి తర్వాత కుర్బానీ ఇస్తారని సభ్యులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సమాజంలో అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలన్నారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే ఊరుకోబోమని రౌడీషీటర్లను ఎస్‌ఐ హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

ఈదురు గాలులకు కూలిన చెట్టు కొమ్మలు


సీతమ్మధార వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట రోడ్డుపై చెట్టు కొమ్మలు

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు కూలిపోయాయి. రోడ్లపై అడ్డంగా కొమ్మలు విరిగిపడి ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. కూలిన చెట్టు కొమ్మలను సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద రోడ్డుపై పడివేశారు. స్థానికులతోపాటు అటువైపు రాకపోకలు సాగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. అదే రోడ్డులో కార్లు పార్క్‌చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎర్నిమాంబ అమ్మవారికి దశమి పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠమాస శుద్ధ దశమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు

సీతంపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేయాలని కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు పిలుపునిచ్చారు. బ్యాంకు స్థాపించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెంలోని ప్రధాన కార్యాలయంలో రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. చైర్మన్ రాంబాబు, ఏయూ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమా మహేశ్వరరావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పలువురికి ప్రాణదానం కల్పించే ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన బ్యాంకు యాజమన్యాన్ని అభినందించారు. బ్యాంకు ఖాతాదారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులకు లీ ఫార్మా వారిచే బీపీ, సుగర్, ఎముకల పటుత్వం వంటి పరీక్షలు నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో కె.శ్యామ్‌కిషోర్, డైరక్టర్లు డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, బి.నాగేశ్వరరావు, పీఆర్వో జి.ఎస్.శివప్రకాష్, లయన్ బ్లడ్ సెంటర్, లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బాల సాహిత్యం కోసం కృషి


నాగశిరీషకు బహుమతి ప్రదానం చేస్తున్న స్వరాజ్యం వెంకట రమణమ్మ

సీతంపేట: బాలబాట బాలల మాసపత్రిక బాలల నాటిక రచనల పోటీ బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలబాట సంపాదకురాలు స్వరాజ్యం వెంకటరమణమ్మ మాట్లాడుతూ బాలల కోసం, బాలల చేత మాసపత్రిక ప్రచురిస్తున్నట్టు తెలిపారు. బాల సాహిత్యం, బాలల కోసం కథలు, రచనలు మరిన్ని రావాలన్నారు. రచయితలు కూడా బాలల కోసం మరిన్ని రచనలు చేయాలని కోరారు. విద్యార్థి దశలోనే బాలలకు సాహిత్యంపై ఆసక్తి కల్పించేలా పాఠశాల స్థాయిలో కథలు, కవితలు రచించేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోటీలో ప్రథమ బహుమతి గెలుపొందిన ఎస్.మంగరత్నం(కాకినాడ), ద్వితీయ బహుమతి సింహాద్రి నాగశిరీష (హైదరాబాద్), తృతీయ బహుమతి సిహెచ్.చిన సూర్యనారాయణకు బహుమతి ప్రదానం, నగదు పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పాణ్యం దత్త శర్మ, గంపా శ్రీదేవి, ఎం.సుగుణరావు, ఓట్ర ప్రకాశరావు, పి.వి.శేషారత్నంలకు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాటక కర్త నవరసమూర్తి, రచయిత కొలచిన రామజగన్నాథ్, ప్రొఫెసర్ అయ్యగారి సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కైలాసగిరి


కైలాసగిరిపై గుర్రంపై రైడ్ చేస్తున్న చిన్నారి



ప్రత్యేక ఆకర్షణగా ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్


9డీ సినిమా థియేటర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ: కైలాసగిరికి రెండు రోజుల నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి ఇక్కడ పచ్చని మైదానాలు, పిల్లలు ఆట స్థలాలు, పరికరాల వద్ద సందడి చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వ్యూ పాయింట్ వద్ద ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో సందర్శకులు దూరంగా నిల్చుని ఫొటోలు దిగారు. ఈ వ్యూ పాయింట్ నుంచి సముద్ర తీరం, బీచ్ రోడ్డు అందాలు రుషికొండ వరకు కనిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ సెల్ఫీలు తీసుకుంటూ ముచ్చటపడుతున్నారు. కొండపై శివపార్వతుల విగ్రహాల పక్కనే ఈ వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. కైలాసగిరిపై ప్రధాన ద్వారం వద్ద ఇటీవల '9డీ' సినిమా థియేటర్ ఏర్పాటు చేశారు. ఈ థియేటర్ మరింత సందడిగా మారింది. ఇందులో 10 నిమిషాల పాటు వేసే 9డీ సినిమాను పిల్లలు, పెద్దలు చూడడానికి ఆసక్తి కనబరిచారు. ఈ 9డి సినిమాలో 6 ఫిల్మ్‌లు ఉంటాయి. వాటిలో ఏది కావాలంటే ఆ ఫిల్మ్ చూపుతారు. 3డీ సినిమా మాదిరిగా మరింత డెవలప్‌మెంట్‌తో 9డీ సినిమా ప్రదర్శిస్తున్నారు.

సీఐటీయూ జోన్ కమిటీ సమావేశం

తాటిచెట్లపాలెం: సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ సమావేశం ఆదివారం తాటిచెట్లపాలెం దరి చిట్టిబాబు కాలనీలో నిర్వహించారు. ఈ సమావేశానికి 22 రంగాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మృతికి నివాళులర్పించారు. జోన్ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ జరిగిన పోరాటాలు, రాబోయే రోజుల్లో చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. సీఐటీయూ కార్మికుల అభ్యున్నతి కోసం ఏ విధంగా కృషి చేస్తుందో వివరించారు. సిటు ప్రజా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.స్వతంత్రకుమార్, వైస్ ప్రెసిడెంట్ వి.బాబ్జీరావు, గౌరీష్, నీలకంఠం, ఎన్.ప్రకాశరావు, యు.ఎస్.ఎన్.రాజు, జి.అప్పలరాజు, శంకర్, బి.లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


విభావరిలో పాల్గొన్న గాయకులు, అతిథులు

డాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ప్రయాసలతో సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వర్ధమాన గాయకులు పి. రాంబాబు, పూర్ణిమ, సీహెచ్‌వీ సత్యనారాయణ, శైలజా మీరజ్, భాగ్యలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్ప రాధ తదితరులు పలు తెలుగు చిత్రాల్లోని మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించగా కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, జీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో శ్రమదానం

విశాఖ విద్య: మద్రిపాలెం రైతుబజారు ప్రాంగణంలో ఆదివారం శ్రమదానం చేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు ఆధ్వర్యంలో వ్యాపారులు, రైతులు స్వచ్ఛందంగా ప్రాంగణంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఇక్కడి ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తను తరలించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఈవో వరహాలు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తరచూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

నేటి నుంచి పైడిమాంబ ఉత్సవాలు


పైడిమాంబ అమ్మవారు


ముస్తాబైన పైడిమాంబ ఆలయం

కంచరపాలెం: సంకురపేట వాసుల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు రాము, శంకర్ తెలిపారు. సోమవారం తొలేళ్ల సంబరం, 18న మంగళవారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం ప్రధాన జాతర ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో అర్చకులు పులకండం శ్రీనివాసశర్మ, పూజారి పిల్లి చంద్రశేఖర్, వెంకటరెడ్డి, సభ్యులు రమణ, సూరిబాబు, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


దిలీప్‌కుమార్ మృతదేహం

మద్రిపాలెం: ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దరి తిక్కవానిపాలెం శివాలయం వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న వై.దిలీప్‌కుమార్(22) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరు ఒక ఏడాది నుంచి దూరంగా ఉంటున్నారు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఈ నెల 13న చెదలమందు తీసుకుని, వెంటనే చున్నీతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన ఇరుగుపొరుగు వారు బయట ఉన్న అతడి తండ్రికి తెలిపారు. దిలీప్‌కుమార్ స్నేహితులు, చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకి దించి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మనస్థాపంతో తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెంది ఉండవచ్చని దిలీప్ తండ్రి నరసింహమూర్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేపట్టారు. దిలీప్‌కుమార్ మరణానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు


తండ్రులను సత్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న తండ్రులు సీహెచ్ సూర్యనారాయణ, నాగేశ్వరరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనకి జీవితాన్నిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలని, ఫాదర్స్ డే సందర్భంగా ఈ తండ్రులను సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి భరోసాగా నిలిచిన సంస్థను, సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పోలవరపు అప్పలకొండ, సోంబాబు, మహిళా సభ్యులు ఉమాదేవి, రాణి, రత్న, సుజాత, ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

స్వామి వివేకానంద సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 200 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు.

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ముగిసిన సంగీత కచేరీలు



వేణు వాయిద్య కచేరీ చేస్తున్న అదితి బృందం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన సంగీత కచేరీలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ముంబైకు చెందిన అదితి సుదర్శన్ వేణు గానంతో సంగీత ప్రియులను ఓలలాడించారు. అనంతరం కుమారి కోట, గాయత్రీ వరేణ్యులు గాత్ర కచేరీతో అలరించారు. అకాడమీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పేరాల బాలమురళి తదితరులు పాల్గొన్నారు.